# గెలుపు

కొండాపురం మండలం నుంచి జడ్.పి.టి.సి మెంబరుగా గార్ల దిన్నె శంకరరెడ్డి గెలుపు ప్రకటించగానే టపాకాయలు కాల్చారు. ఔట్లు పేల్చారు. కాలుస్తూ పేలుస్తూ ఉండగా ఓపెన్ జీపులో నిలబడ్డ రెడ్డికి పూలమాలలు వేసి ఊరేగింపు ప్రారంభించారు జిల్లా పరిషత్తు హైస్కూలు నుంచి రెడ్డి ఇంటిదాకా.

ఊరేగింపు ముందుభాగంలో మందుగుండు సామాను సాహసులుండగా, వాళ్ళ వెనుక తప్పెట్లు కొట్టే నిపుణులు రాగా, రెడ్డి నిలబడ్డ జీపు వాళ్ళను అనుసరిస్తూ పోగా, గెలుపు వినగానే పంచిన సారాయి పాకెట్లు అందినన్ని తాగి జైకొట్టే జనం జీపు చుట్టు పక్కలా, వెంటబడీ రాగా, మామోపుగా ఊరేగింపు బయలెల్లదీశారు.

యం.ఏ; పిహెచ్.డి చేసి, తగిన ఏ ఉద్యోగం రాక, డి.యస్.సి.లో క్వాలిఫై అయి, తెలుగు టీచర్‌గా మూడు వేల రూపాయల జీతానికి కుదిరి, కొలువు దొరికిందనిపించుకొని, పురుషలక్షణం ఋజువు చేసుకొన్న డా. నాగేశ్వరాచారి, లెక్కబెట్టిన ఓట్ల కట్టలు ట్రేల్లో పెట్టి, సంతకాలు చేసి, స్కూలు గేటుదాటి, బయటపడి, రోడ్డు వారావచ్చి, శంకరరెడ్డి ఇంటి ముందట వాళ్ళ తండ్రి ధర్మంగా కట్టించిన బస్సు షెల్టరులో బస్సురాకకోసం నిరీక్షిస్తూ కూర్చుని ఉన్నాడు.

మండల కేంద్రంలోని హైస్కూలు కావటంవల్ల కౌంటింగు సెంటరుగా చేయటంతో స్కూలుకు సెలవు అయినందున తల్లిలేని, అక్కాచెల్లెళ్ళు లేని, సన్నోబులు, తనకున్న ఒకే ఒక్క అంగీ సెడ్డీ ఉతికి ఆరేసుకొని, గోచీ పెట్టుకొని, కొట్టంలో దూరి తడిక వేసి, వయిరు మంచం వేసుకొని, బూతలింగంలాగా మిడిగుడ్లేసుకొని బోదగడ్డి ఈనెల్ని పరకాయించి చూస్తూ వెల్లకిల పడుకొన్నాడు. గోచీ పెట్టుకొన్నప్పుడు ఎవరికీ కనిపించని నల్లని తుమ్మమొద్దులాంటి పదకొండేళ్ళ ఆరోతరగతి చదివే తెలివైన సన్నోబులు దగ్గరకు తడిక తోసుకొని తండ్రి బాలనరసిమ్మ సారాయి పాకెట్టు పరీమళం పబ్లిక్కుగా వ్యాపిస్తుండగా వచ్చి 'కొడుకా! నూర్రూపాయల్రా, అర్ధగంటపన్రా, రారా!' అన్నాడు.

వయిరు మంచంమీద నిగిడి పడుకొని ఉన్న సన్నోబులు, కదల్లేదు, మెదల్లేదు, తండ్రిని చూడలేదు.

'నూర్రూపాయలు: అంగీసెడ్డీ రెడీ లెయ్, బిరీన' అన్నాడు బాలనరసిమ్మ.

కొడుకు తండ్రి ముఖంలోకి నిజమేనా అన్నట్లుగా చూస్తే 'నిజమే, అమ్మతోడు,

నేన్నీ దుడ్డుముట్టను, నీ లెక్క నీదే, నీ అంగీ, సెడ్డీ నీకి నీకే నా కొద్దు! ఆ లెక్కతో తాగను' అన్నాడు తండ్రి. 'నువ్వు దరువేత్తే దిమ్మదిరిగిపోవల్ల నా కొడుకులకి' అనీ అన్నాడు తండ్రి.

'మరి నాకు పలకేది?'

'నాది నీకు, మీతాతది నాకు!'

తప్పెట కొట్టటం సన్నోబులుకు చాలా ఇష్టం. దరువేస్తూ తనలో తానే మురిసిపోతాడు. ఎవరూ లేనప్పుడు దొడ్డుల్లోకి పోయి తప్పెట కాలుసుకొని ఖణేల్ మనగానే దరువేయటం మొదలు పెడతాడు.

మహానిపుణుడు మద్దెల వాయించటం అభ్యసించినట్లు, మహానర్తకి తననాట్యం తాను అలసిపోయిందాకా తరిబీదు తీసుకొన్నట్లు, మహాగాయకుడు రాత్రంతా తన గాన శిక్షణలో తలమునకలయినట్లు, సరస్వతీదేవి సాక్షాత్కారం కోసం రాత్రంతా మహాకవి కృషి చేసినట్లు, సన్నోబులు తన్మయత్వంతో తప్పెట దరువు వేస్తాడు. అటువంటిది దైవం అతడికి ఇచ్చిన విద్య. మాదిగపల్లె జనం అంతా గుమిగూడే పండగల పెళ్ళిళ్ళలో సన్నోబుల్ని దరువేయమని కోరతారు. వాళ్ళు కోరటమే తడవు. తప్పెట తెచ్చుకొని, కాల్చి, కాక చూసి కొడుతుంటే, మహామహా ఆరితేరిన తప్పెట కొట్టే మాదిగలే ఆదమరచి విని చూచి ఆనందంతో ఏడ్చేస్తారు.

తప్పెట దరువేసే పని, తనవాళ్ళే కాకుండా ఊరివాళ్ళందరూ చూసే సమయం, నూరు రూపాయిలు కూలీ, అంగీ, సెడ్డీ కొత్తవి వచ్చే సందర్భం, సన్నోబులుకు ఇష్టంగానే ఉంది కాని 'సెడ్డీ!' అన్నాడు. ఉతికి ఆరేసిన సెడ్డీ లోంచి నీటి బొట్టులు పడుతూనే ఉన్నాయి.

'తుండు సుట్టుకోలే!' అన్నాడు తండ్రి.

చాలీ చాలని తువ్వాలు చుట్టుకొని వెలుపలికి వచ్చాడు సన్నోబులు. కొడుకు వెంట తండ్రీ వచ్చాడు. తడిక లాగాడు. కుక్కలు దూరకుండా, కుండల్లో మూతిపెట్టకుండా తడిక్కి తాడు గట్టాడు.

తాత పలక తండ్రి తీసుకోగా, తండ్రి పలక తాను తీసుకొని, కసువు గడ్డీగాదం పోగేసి మంటరాజేసి, పలక కాచుకోసాగాడు సన్నోబులు. అతడి వెంట తండ్రీ తన పలక్కి సెగ చూపాడు. అది బాగా కాలిందని కాకమీద ఉందని చూపుడు వేలితో కొట్టాడు. అరిచేత్తో చరిచాడు. చిటికెన పుల్లతో వాయించాడు. తప్పెటకు కట్టిన వారు ఎడమ గూటి కుదురుకు తగిలించుకొని, ఎడమచేయి చిటికెనపుల్ల జరజరలాడించి,

తప్పెట కుదురు గుండెకు గడ్డానికి ఆనించుకొని గుడిచేతి తప్పెట పుల్లతో కొడుతుంటే మోత దద్దరిల్లుతూ ఉంది. అంబ పలుకు జగదంబా పలుకు, మూలనున్న ముసలమ్మా పలుకు, కాటికాడి కోటేసూ పలుకు అన్నట్లు పంబరేగుతూ ఉంది.

కొడుకు వెంట తండ్రీ తప్పెటతో వచ్చాడు. ఆ ఇంట్లో ఎప్పుడూ ఇద్దరు తప్పెట వాయించే తండ్రీ కొడుకూ ఉంటారు. తాత ముసలవాడయిపోతే, మనమడు కుర్రవాడయి సిద్ధంగా ఉంటాడు.

వాళ్ళకు తప్పెట కొట్టటం దండోరా కోసమే కాదు, ఊరిగింపుల కోసమూ కాదు. పెళ్ళిళ్ళకూ పేరంటాలకూ కాదు. పుటకలకీ చావులకూ కాదు, విద్య అనీ, గానమనీ, కళ అనీ కాదు. పోతురాజు బలి అని, ఎల్లమ్మ మొక్కు అనీ దేవతార్చన అని భక్తి శ్రద్ధలతో విశ్వాస పూజలతో చేసే పని.

జనానికి అది ఊరేగింపు దరువే అయినా తండ్రీ కొడుకులకది కొలుపుల్లో చేసే పూజాకార్యం, దైవకార్యం, దేవుడి మొక్కు మనిషికి దేవుడికి మధ్య శబ్దమార్గం. నృత్య మాధ్యమం. మనిషి ఆర్తి దేవుడికి వినిపించే కేక తప్పెట దరువు. ఈ తప్పెట దరువు ప్రవాహంలో పడి మానవాత్మ ఈదుతూ దేవుడి దగ్గరకు పోతుంది. ఈ శబ్దం తీగ పట్టుకొని మనిషి అంతరాత్మ పాకిపోయి ఆత్మలో లీనమయిపోతుందని వీళ్ళ విశ్వాసం. అందుకే తప్పెట ఎప్పుడు కొట్టినప్పటికీ పూజ చేస్తున్నంత భక్తితో తాదాత్మ్యంతో దరువేస్తారు ఏదో అయిందిలే అనిపించరు. మనో వాక్కాయ కర్మలతో నిష్ఠగా తప్పెట వాయిస్తారు.

తండ్రి కొడుకులు బాలనరసిమ్మ, సన్నోబులు తప్పెట వాద్యగాళ్ళలో చేరగానే గార్లదిన్నె శంకరరెడ్డి గెలుపు ఊరేగింపు మొదలయింది.

నవ్వితే పళ్ళు కనబడి ముఖమని తెలుసుకోవటమే తప్ప, ముఖం, శరీరం, తల జుట్టు అంతా అఖండంగా ఒకే రంగుగా ఉండే సన్నోబులు దరువేస్తూ అడుగేస్తుంటే పైన ఊగుతూ, ఎగురుతూ పడుతూ ఉండే జులపాల ఉంగరాల తలజుట్టు మనిషి రంగే ఉన్నా వేరుగా కనబడసాగింది. ఎగిరే జుట్టు ముఖం మీద పడుతుంటే అడుగేయటంతోనే అది ఎగిరి పైకి పోయి పడేట్టు చేసుకొంటూ దరువేస్తున్నాడు సన్నోబులు.

చేతులు రెండూ తప్పెట పలకమీద పలుకులు పలికిస్తుండగా, కాళ్లు తిన్నగా, వలయంగా, వెనగ్గా ముందుగా లయబద్ధంగా పలక పలుకులకు అడుగుల కులుకులకు ఒకే సూత్రం కట్టినట్లుగా శరీరం అంతా పేంబెత్తం వంగినట్లు వంగిపోతూ లేస్తూ జవజవలాడుతూ, కునకువలాడుతూ గింగిరాలు తిరుగుతుంటే అల్లెం గుండెత్తిన కొత్తల్లుడు కల్లం తిరిగినట్లు సన్నోబులు కలదిరుగుతేంటే కనుల పండగ, చెవులకు ఊరట, ఆత్మశాంతి, ఆనంద సామ్రాజ్య సౌఖ్యం.

సన్నగా, చిన్నగా, పలచగా ఉన్న సన్నోబులు శరీరంలో అంత చెమట ఎక్కడ ఉందో, ఎందుకు దానికంత ఆరాటమో ప్రతివెంట్రుక పాదులోంచి పొటమరించి, నిక్కి చూసి, వెలికురికి, బొట్టు కట్టి, బొట్లే కదలి వాలు గట్టి జాలు కట్టి తలమీద నుంచి వేలాడదీసిన పురికొసలులాగా వళ్ళంతా దారాలు వేలాగినట్లు చెమట తెల్లగా పుట్టి, నల్లవొంటిమీద నల్లగా మారి, కారిపోతూ ఉంది. నూనెలేని తల జుత్తులో పుట్టిన చెమట తల వెంట్రుకల్ని తడిపి స్నానం చేయించి ముద్దగట్టి పోయేట్టు చేయగా, జుట్టు, ఎగురుతున్నప్పుడు ముఖం మీద పడుతూ చెర్నాకోలతో చరుస్తున్నట్లుగా ఉంది.

ఊరేగింపు బస్సు షెల్టరు దగ్గరకు వచ్చినప్పుడు డా. నాగేశ్వరాచారి చూపు సన్నోబులు మీద పడింది. తెలుగు పద్యాలు బాగా పాడే ఆచారికి పాఠం శ్రద్ధగా విని బాగా చదువుకొనే సన్నోబులంటే చాలా ఇష్టం. బాగా చదువుకోరా నా అంతటి వాడినవుతావు అని ఆశీర్వదించాలని ఆచారి అనుకోకపోలేదు. తను ఏమంత గొప్పవాడు అయ్యాడని పసివాణ్ణి ఆశీస్సులతో ముంచెత్తాలనుకొని, 'బాగా చదువుకోరా పైకివస్తావు' అని మాత్రమే దీవించాడు.

సన్నోబులు అంగీ సెడ్డీలేకుండా ఉండటం వల్ల ఆచారికి బాధ కలిగింది. బాగా చదివి పైకి రావలసిన వాడు కులంవాళ్ళు కొట్టే తప్పెట కొదుతుంటే కులం హద్దులు దాటి రాలేకపోయే పరిస్థితిలో పడిపోతాడని దిగులుకలిగింది.

నాగేశ్వరాచారి బాల్యంలో కమ్యూనిష్టు ప్రభావంతో పెరిగాడు. కులాల హెచ్చుతగ్గులు అతడి దృష్టిలో లేవు. ఉన్నవాళ్ళు లేని వాళ్ళు తేడాలు అతడు గుర్తించడు. పెరిగి పెద్దవాడవుతున్న కొద్దీ మార్క్సిష్టు ప్రభావం ఎక్కువ కాసాగింది.

ఆచారిని చాలామంది నక్సలైట్ల సానుభూతి పరుడంటారు. ఎర్రసాహిత్యం ఎక్కువగా చదువుతాడనీ, చదివిస్తాడనీ, పిల్లల్ని నక్సలైట్లుగా మారుస్తున్నాడనీ, అడవులకు పంపుతున్నాడని అనుకొంటుంటారు. ప్రజలు అనుకొంటున్నట్లే కొండాపురం చుట్టు పక్కలంతా అడవే! అందులో నక్సలైట్లు తిరుగుతుంటారని జనం చెవులు కొరుక్కుంటూ ఉంటారు.

డా. నాగేశ్వరాచారికి సన్నోబులు తెలివైన వాడని, తనకంటే బాగా పద్యం చదువుతాడని, సరస్వతి వాడి నాలుక మీద నాట్యం చేస్తుందని అనుకొంటూ ఉండి వాణ్ణి చేరదీసి ప్రోత్సహించటం ఎంతో సంతోషం.

ఆచారి అయ్యోరు భుజం మీద చేయి మాట్లాడతాడని సన్నోబులుకు బలే కుశాల.

శాస్త్రి అయ్యవారు పెదాలతో నవ్వుతాడు. కళ్ళతో ప్రేమిస్తాడు. కాని సన్నోబుల్ని తాకడు. వాడి పలక కూడా ముట్టడు. పలకమీద రైట్ అని టిక్కుపెట్టాలంటే కూడా

పలక సన్నోబులు పట్టుకొని చూపిస్తుంటే చూసి బలపంతో ఇట్టా సుతారంగా టిక్కు కొట్టి అట్టా సుతారంగా చేయి వెనక్కు తీసుకొంటాడు శాస్త్రి అయ్యవారు.

శాస్త్రి అయ్యవారు అయిదో తరగతిలో తెలుగు చెప్పేవాడు. పెద్ద బొజ్జ. ఇంతమందం కళ్ళద్దాల జోడు. అంగీ ఉండదు, మనిషి పొట్టి. కొంకిర పళ్ళు. పద్యాలు రాగయుక్తంగా చదువుతాడు. శాస్త్రిని చూచి, పద్యాలు విని, తాను పద్యాలు చదివేది నేర్చుకొన్నాడు సన్నోబులు.

అయ్యవారు ఇష్టమే: అంటూ గింటూ అంటేనే కష్టం.

ఒకసారి సన్నోబులు పలక మీద టిక్కు కొట్టి చేయి జారి పలపం నేలమీద పడింది. 'తీ' అన్నాడు అయ్యవారు.

సన్నోబులు పలకమీద టిక్కుచూశాడు. కిందబడ్డ బలపం చూశాడు. తీయమన్న గురువుమాట విన్నాడు. తీయాలంటే అంటు కోవాలి. అంటుతగులుతుంది. అయ్యవారికి అపచారం అవుతుంది. ఏం చేయాలో తోచలేదు. అయ్యవారు వంగలేదు. వంగి తీసుకోలేడు. సన్నోబులు వినలేదనుకొని మళ్ళీ 'తీ' అన్నాడు. ఎవరో పిల్లవాడు తీసి ఇవ్వబోయాడు. శాస్త్రి అతణ్ణి వారించాడు. ఆ పిల్లవాడు తీసి ఇచ్చి ఉంటే సన్నోబులుకు కష్టం తప్పేది. కాని అయ్యవారు అతణ్ణి ఆపి తననే తీసి ఇమ్మంటే కష్టంగా అనిపించింది. ఇష్టం కలగలేదు. కదలకుండా మెదలకుండా ఊరుకొన్నాడు.

'మాదిగ ముండా కొడక' అని అయ్యవారు అవగానే సన్నోబులుకు తిక్కరేగింది.

'తేలే!' అనగానే 'తీస్కోలే' అనేశాడు. అనేసి నాలిక్కరుసుకొన్నాడు.

అయ్యవారు బిత్తరపోయాడు. 'వీడు ఎంతమాట అన్నాడు' అని గింజుకొన్నాడు. హెడ్ మాష్టరు కూడా శాస్త్రిని మందలించటంతో సన్నోబులుకు సమస్య తప్పింది కానీ అయ్యవార్లందరిలో అతడంటే ప్రేమ లేకుండా పోయింది. ఆరో తరగతి తెలుగు అయ్యవారు ఆచారి ఒక్కడే అతణ్ణి ప్రేమగా చూస్తుంటాడు.

అటూ ఇటూ ఊరుండటంవల్ల రోడ్డు సన్నగా ఇరుకుగా మారింది. ఇళ్ళలో జనం వీధిలోకి వచ్చి ఊరేగింపు చూస్తుండటంవల్ల జనం వెడల్పు తగ్గి పొడుగుపెరిగారు. ఆ ఊళ్ళో మెరవణి జరిగితే అటు ట్రాపిక్ అటు, ఇటు ట్రాఫిక్ ఇటు ఆగిపోతుంది. మెరవణి ఒక పక్కకు ఒత్తుకొని తోవ ఇస్తే తప్ప ఏ వాహనమూ పోదురాదు. ఇది గార్ల దిన్నె శంకరరెడ్డి గెలుపు ఊరేగింపు. గార్లదిన్నె రెడ్లంటే ఆ మండలంలో గుండెల్లో గుబులు. అట్లాంటి శంకరరెడ్డి మెరవణి అంటే ఊరికి హడలు. ఆమాత్రం వాహనాలు ఆగకపోతే శంకరరెడ్డి జడ్.పి.టి.సి సభ్యుడైనట్లు చుట్టుప్రక్కలవాళ్ళకు తెలిసే దెట్లా? అయినా ఇది

రోజులకొద్దీ జరిగే ఊరేగింపు కాదు గదా! గంటా రెండు గంటల్లో ముగిసిపోతుంది. కాబట్టి ట్రాఫిక్ బంద్! వాహనాలు రాలేదు, పోలేదు. బస్సు షెల్టర్ దగ్గర పోగయిన జనం నిమిషనిమిషానికి పెరిగి పెద్ద గుంపు అయ్యారు.

ఎదురుగా శంరరెడ్డి మిద్దె , అమ్మయ్య పసుపు నీళ్ళు తమల పాకులు ఆపైన వక్కలు సున్నంతో హారతి పళ్ళెంతో సిద్ధంగా ఉంది. పెద్ద సేద్దెగాడు పసుపు కుంకాలు కలిపి కూరిన గుమ్మడి కాయ కొట్టటానికి ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాడు. మంత్రాలు చదివి, దీవించి ఇంట్లోకి పంపటానికి అయ్యవార్లు సంసిద్ధంగా ఉన్నారు. పెద్దామె వాకిట్లో భర్తకోసం ఎదురు చూస్తుండగా, చిన్నామె వీధిలోకి, మిద్దెలోకి చెంగనాలుతీసే లేగదూడలాగా ఉరుకులు పరుగులు మీద ఉంది. ఎవరైనా పిలిచినా, తలచినా, తాకినా ఉలిక్కిపడుతూ ఉంది.

బస్సు షెల్టరు, మిద్దె మధ్యలో ఆగిన ఊరేగింపు. జనం సన్నోబులును ఒక్కడినే అడుగేస్తూ దరువేయమన్నారు. మిగతా వాద్దెగాళ్ళను ఆగిపొమ్మన్నారు. అప్పటికే తడిసి ముద్దయి, స్నానం చేసి వళ్ళు తుడుచుకోని వాడిలాగా ఉన్నాడువాడు.

డా. నాగేశ్వరాచారి సన్నోబులును చూసి దిగులు పడ్డాడు. చదువుకోవలసినవాడు తప్పెట కొట్టుకొంటూ తిరగటం ఇష్టంలేదు. శుభ్రంగా ఉండేవాడు చెమటతో మురికిగా ఉండటం నచ్చలేదు. అంగీవేసుకొని గొంతుదాకా గుండీలు పెట్టుకొని ఉండే పిల్లవాడు పైన ఏమీ లేకుండా ఉండవలసి రావటం కష్టంగా ఉంది. అంతమంది జనంలో ఆచారిని గుర్తు బట్టాడు సన్నోబులు.

తనకిష్టమైన గురువుకు తనకున్న ఈ విద్య ఇందులో తన నైపుణ్యం చూపే అవకాశం వచ్చిందని గురువుకు దండం పెట్టి అడుగెయ్యసాగాడు. కొంత నిజం బలం కొంత కొత్తబలం కలగలిసి దరువేస్తున్నాడు సన్నోబులు. మామూలుగా తప్పెట కొడుతూ అడుగేస్తూ ఉంటే చూడముచ్చటగా ఉంది.

అంతా ఊరేగింపు సంగతి వదిలి, శంకరరెడ్డిని జీపులో ఉంచి చుట్టూ వలయాకారంగా సన్నోబులు దరువేస్తున్నచోట చేరారు జనం. కదం తొక్కినట్లుంది అడుగెయ్యటం! తప్పెట అంబా అని అరుస్తున్నట్లుగా పలక కంగు కంగు మంటూ మంటూ ఉంది. కాలి అడుక్కి చేతి ఏటుకి పొంతన కుదిరి చూడ ముచ్చటగా సన్నోబులు కల్లం తిరుగుతున్నాడు.

క్రమ క్రమంగా వేగం పుంజుకుంటూ ఉంది. అడుగు వేగంగా పడుతూ ఉంది. తోడుగా దరువు పెరుగుతూ ఉంది. అడుగు దరువు లయతప్పకుండా చువ్వలాంటి సన్నోబులు పులిలా గాండ్రిస్తూ, ఎగురుతున్నట్లున్నాడు.

ఎమ్‌రా సన్నోడెయ్‌రా
ఎయ్‌రా నీ సోకుమాడ
ఎయ్‌రా సన్నోడెయ్‌రా
దరువెయ్‌రా సన్నోడెయ్‌రా

అంటూ ఎవరో పాడసాగారు. చుట్టూ ఉన్నవాళ్ళు కూడా వంత పాడారు. అంతలోనే వరస మార్చారు. సన్నోబులు జనం పాటకు తగ్గట్టుగా అడుగేస్తూ దరువేస్తూ చిందేస్తున్నాడు. శివాలెత్తి పోతున్నాడు.

ఎయ్‌ర సన్నొడెయ్‌ర
ఎయ్‌ర నీ సోకుమడ
ఎయ్‌ర సన్నొడెయ్‌ర
అడుగెయ్‌ర సన్నొడెయ్‌ర అని పాటలో వేగం పెంచారు.

సన్నోబులు అడుగులో వేగం పెరిగింది. దరువులో అంత వేగం పుంజుకొంది. చేతులు కదిలినంత ఊపుగా కాళ్ళు కదులుతున్నాయి. వళ్ళంతా చిందేస్తూ ఉంది. శివం పెరిగినట్లు, గణం పెరిగినట్లు. దెయ్యం పూనినట్లు, దేవత ప్రత్యక్షమయినట్లు ఊగి, రేగి, తూగి, తూలి, దుమ్మురేపుతున్నాడు సన్నోబులు.

నల్లటి నడ్డిమీద, కారునల్లటి నడ్డిమీద, అందమైన అద్భుతమైన చీకటి లాంటి కారునల్లటి నడ్డిమీద తెల్లటి తుండు గుడ్డముక్క ఉండానికి సిగ్గుపడి జారిపడి, దుమ్ము కలిసి, నేలపాలయి పోయింది. మొలమీది గుడ్డముక్క ఊడి పడిపోయినా సన్నోబులు చిందాపలేదు. అడుగాపలేదు. దరువాపలేదు. జనం ఈలలు, కేకలు, గోలగోల!

అడుగు అగ్రం చేరాక, దరువు తీరం చేరాక, చిందు శిఖరం చేరాక సన్నోబులు కళారూపం అత్యద్భుతంగా కనిపించింది. జనం చప్పట్లు ఈలలు కేకలు ఆగిపోయాక, పెంచుతూ పోయిన వేగం తగ్గిస్తూ వచ్చి ఆరోహణం పూర్తయ్యాక అవరోహణం చేసి, ఆగిపోయాడు సన్నోబులు. అప్పుడు మిగతా వాద్దెగాళ్ళు తప్పెట్లు కొట్టసాగారు.

సన్నోబులు శివం తగ్గి, చిందాగి, ఆటాగి, దరువాగినప్పుడు మొలమీద బట్ట లేదని, గోచిమాత్రమే ఉందని గుర్తించి సిగ్గుపడే తీరికా ఓపికా లేక రొప్పుతూ నిలబడ్డాడు.

డా. నాగేశ్వరాచారి కళ్ళలో తిరుగుతున్న నీళ్ళు సన్నోబులు దరవాపినప్పుడు రాలి కింద పడ్డాయి. జనం తోసుకొంటూ పోయి, తన విద్యార్థిని భుజం తట్టుతూ నిలబడ్డాడు ఆచారి. కళ్ళు తుడుచుకొన్నాడు.

భుజం తట్టటం వెనుక నీ విద్య చూశానన్న మెచ్చుకోలు ఉండవచ్చు, నీకెందుకీ కష్టం అన్న దుఃఖం ఉండవచ్చు. ఇంత చిన్న వయస్సులో ఎంత పెద్ద విద్య ప్రదర్శించావన్న పొగడ్త ఉండవచ్చు. నీకీ పని లాకీ కాదు అనే మందలింపు ఉండవచ్చు. సన్నోబులు మాత్రం గురువు పాదాలకు నమస్కరించాడు.

డా. నాగేశ్వరాచారిని ఏమన్నా అంటే అన్నలకు కోపం వస్తుందని ఆవూళ్ళో అందరికీ నమ్మకం. అందుకే అతనొస్తుంటే బరాబరులు తీరి తోవ ఇచ్చారు. సన్నోబులును మెచ్చుకోదలచిన ఇతరులు కూడా అక్కడ లేకుండా పక్కలకు వెళిపోయారు.

ఊరేగింపు పూర్తయింది. చివరి పటాకులు కాల్చారు. ఔటులు పేల్చారు. అమ్మయ్య దిష్టితీసి రంగు నీళ్ళు వీధిలో పోసింది. గుమ్మడికాయ సేద్దిగాడు పగలకొడితే, రక్త మాంసాలు లాగా ముక్కలు పడి బలి ఇచ్చినట్లు అయిపోయింది. మంత్రాలు చదివి అయ్యవార్లు శంకరరెడ్డిని ఇంట్లోకి సాగనంపారు.

పెద్దామెకు పిల్లల్లేరు. చిన్నామెకు ఇంటి నిండా పిల్లలు. పైటకొంగు రొంటికి చుట్టుకొని నూర్రూపాయల నోట్లు చేత బట్టుకొని పుణ్యం చేస్తున్నట్లు, ముక్కోటి దేవతలు ఆశీర్వదించి సుపుత్ర ప్రాప్తిరస్తు అంటారని ఆశిస్తూ తప్పెట్లు వాయించిన మాదిగోళ్ళకు కూలి పంచిపెడుతూ ఉంది. తొమ్మిది మంది తప్పెట కూలీలకు తొమ్మిది నూర్లు ఇస్తే వాళ్ళే పంచుకొనే వాళ్ళు. ఆమె అలా ఇవ్వలేదు, అందరికీ తనే ఇస్తానంది. ఒక్కొక్కరే వచ్చి తీసుకుపోవాలని చెప్పింది. ఒక్కొక్కరూ వచ్చి, పెద్దామె కాళ్ళకు మొక్కి నూరు నోటు తీసుకోవాలి. చేతితో కాదు చెంగుతో. వాద్దెగాడు చెంగు పట్టాలి. పెద్దామె నోటు చెంగులో జారవిడుస్తుంది. తాను పట్టుకొని ఉన్నప్పుడు నోటును మరో పక్క కూడా మాదిగ మనిషి పట్టుకోకూడదు. కాళ్ళకు మొక్కేటప్పుడు చేతులు కాళ్ళకు తగలరాదు. అంతదూరంలో ఉండి మొక్కాలి.

పెద్దమాదిగ వెళ్ళాడు. మొక్కినట్లు వంగాడు. తలగుడ్డ తీసి దులిపి విప్పి చూపాడు. అందులో నూరు నోటు అమ్మయ్య వేసింది.

చూస్తున్న నాగేశ్వరాచారికి జ్వరం వస్తున్నట్లుగా ఉంది.

ఒక్కొక్కరూ నూరు నోటు తీసుకొని పోతుంటే తన కొత్త అంగీ, సెడ్డీ కనబడి ఉత్సాహంగా ఉన్నాడు సన్నోబులు. ఎప్పుడూ గోచితో కనబడని పసివాడు కొత్త బట్టల కోసం గోచిగుడ్డతో పదిమందిలో నిలబడ్డాడు. విజయగర్వంతో ఉన్న వాడికి ఉత్త బిత్తలతో ఉండటం అవమానంగా లేదు. మామూలైపోయినట్లు నిలబడ్డాడు.

శంకరరెడ్డి భార్యను చూస్తుంటే కోపంగానూ, సన్నోబులును చూస్తుంటే దిగులుగానూ ఉండి జ్వరం పెరిగి ఊగుతున్న వాడిలాగా నిలబడ్డాడు ఆచారి.

తాను నడుంకు చుట్టుకొన్న తువ్వాలు దుమ్ము దులిపి బాలనరసిమ్మ చాచి పట్టుకొంటే అమ్మయ్య నూరు రూపాయల నోటు చెంగులోకి జారవిడిచింది. అతడి వెనక ఉన్న వాద్దెగాడు ముందుకు వచ్చి, తన కూలీ తీసుకొని పోగానే బాల నరసిమ్మ మళ్ళీ చెంగు పట్టాడు. అమ్మయ చేతిలో ఒక్కనోటే ఉంది. సేద్దెగాళ్ళు రెండోసారి బాలనరసిమ్మ వస్తున్నాడని గదమాయించారు. అతడు వెనక్కు వెళ్ళలేదు. 'లేస్సాం వీ–నాగ్గాదు–నా కొడుక్కూలీ' అంటున్నాడు. మాట విన్న సేద్దెగాడు ఆగిపోయాడు. విననివాడు బాల నరసిమ్మని నెట్టివేశాడు. బాలనరసిమ్మ కిందపడ్డాడు. దుమ్ములో పొర్లి లేచాడు 'నా కొడుక్కుగానీ కూలీ రాదేం దేవరా! అంటూ చెంగు చాస్తూ ముందుకు వచ్చాడు. 'సెప్పేది నీగ్గాదేం వాయ్' అంటూ ఆ సేద్దెగాడే మళ్ళీ నెట్టేశాడు. ఈసారి మరింత దూరంగా పోయి పడ్డాడు.

'వాని కూలీ వాన్నే కొండబొమ్మనుండ్రి' అంది అమ్మయ్య.

'పోరా! తేబో' అన్నాడు పైకి లేస్తూ సన్నోబులుతో.

మెటికల మీద నిలబడ్డ అమ్మయ్య దగ్గరకు సన్నోబులు పోయి నిలబడ్డాడు.

పిల్లవాడు పెద్దామె కాళ్ళకు మొక్కలేదు. వాడు నిలబడితేనే ఆమె పాదాలకాడ ఉన్నాడు.

డా. నాగేశ్వరాచారి కళ్ళలో సన్నని వెలుగు గీత తూర్పునుంచి పడమటికి పాకిపోయింది.

యమ కులికిన కుర్రనాగమ్మ కాళ్ళకు మొక్కలేదని గుర్తించింది.

'మొక్కరా!' అన్నారు సేద్దె గాళ్లు. ఆమె వారించింది.

సన్నోబులు చేతులు చూపాడు. ఆమె నోటు రాల్చలేదు.

తప్పెట పలక వెనక్కు తిప్పి పట్టాడు. ఆమె నోటు వేయలేదు.

కళ్ళలో కొత్త అంగీ సెడ్డీ రంగు రంగులుగా ఉంగరాలు ఉంగరాలు తిరుగుతున్నాయి.

'సెంగుబట్టు!' అంది పెద్దామె.

సన్నోబులు దగ్గర తలగుడ్డలేదు. పైపంచలేదు. తన తుండు తండ్రి దగ్గర తువ్వాలుగా ఉంది. పోయి దాన్ని తెచ్చుకోవటం అవమానంగా అనిపించింది.

తన కొత్త బట్టలకు నిప్పు అంటుకొన్నట్లుగా అనిపించింది.

నాగేశ్వరాచారి గణాచారిలాగో ఊగిపోతున్నాడు. ఆపరాని జ్వరం.

గోచి గుడ్డతప్ప, తన వంటిమీద బట్టముక్కలేదు.

మొలతాటిలో వెనకచెక్కి ఉన్న గోచి గుడ్డ ఊడబెరికి, ముందు దోపి ఉన్న కొస

గుంజిలాగి, అతుక్కుపోయి ఉన్నదాన్ని సవరజేసి విడదీసి వెడల్పు చేశాడు. అది అంతా కలిస్తే మోచేతి పొడుగు అరచేతి వెడల్పు ఉంది. దాన్ని చాచి పట్టుకొని ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె సన్నోబులు మొలతాడు మెరుపు చూస్తూ నోటు జార విడిచింది. అది గోచి గుడ్డలో పడలేదు. పడేటట్లుగా గోచి గుడ్డను అటూ ఇటూ జరిపాడు సన్నోబులు. నోటు, ఉన్నవాడి పొగరు లాంటిది. దానికి గాలివాలు తెలుసు. గోచి గుడ్డకు పొడుగూ తక్కువ. వెడల్పూ తక్కువ. ఎంత నిగిడినా ఎంత? ఎంత చాసినా ఎంత? ఎంత తిప్పినా ఎంత? నోటు కింద పడింది.

అంగీ సెడ్డి కాలి బూడిద నేలమీద పడ్డట్లుగా ఉంది. నోటును చూస్తుంటే. 'తీసుకో!' అంది పెద్దామె. 'తియ్‌లే' అన్నారు సేద్దిగాళ్ళు.

సన్నోబులు నోటు తీసుకోలేదు.

చిందేసినంత సేపు ముఖం మీద పడుతూ ఉన్న తడిసిన జుత్తును వెనక్కి తోసుకోవటానికి ఎక్కడలేని సమయం సరిపోకుండా అయింది.

'వాని మానం దీసినాదిరా దొడ్డ ఇల్లాలు' అన్నారెవరో!

పోయిన మానం పోనే పోయింది అని గోచి గుడ్డను విదిలించాడు. వెనుదిరిగాడు.

'ఎంత పొగుర్రా!' అని సేద్దిగాళ్ళు ముందుకు వస్తే, పెద్దామె మెటికలు దిగి, దుమ్ములోకి వచ్చి, నేలమీది పడ్డ లక్ష్మిని పైకెత్తి విదిలించి ఊది చేత బట్టుకొని వాళ్ళను వారించింది ఆ నోటుతో.

పరమేశ్వరుడిలా దిగంబరంగా అడుగేసిన సన్నోబులు గోచిగుడ్డను తలకు రిబ్బను ముక్కలాగా జుట్టుముందుకు పడకుండా ఎగదోసి కట్టాడు.

తప్పెటతీసి, అడుగేస్తూ దరువేస్తూ ముందుకు సాగాడు. డా॥ నాగేశ్వరాచారి కళ్ళలో సూర్యుడూ చంద్రుడూ ఉదయించారు. ఆ కళ్ళలో తిరుగుతున్న నీళ్ళలో ఈ సూర్యచంద్రులు ప్రతిఫలించి కొత్త ఇంద్రధనుస్సులు పుట్టాయి.

ఆచారికి జ్వరం తగ్గింది. ఆనందంగా ఉంది. ఉత్తబిత్తల నల్లతుమ్మ మొద్దును గట్టిగా గుండెలకు అదుముకొన్నాడు.

"మాదిగ నా కొడుకు! వానికెంత తలబిరుసురా! ఎయ్యంగ్రి మెట్టేట్లు' అంటూ వెలుపలికి వచ్చిన శంకరరెడ్డి, కరుసుకొని ఉన్న సన్నోబుల్ని, నాగేశ్వరాచారిని చూసి, సేద్దిగాళ్ళను ఆగిపొమ్మని చెప్పాడు.

అమ్మయ్య నూరునోటు బొడ్లో చెక్కుకొని మిద్దె లోనికి పోయింది.

దండోరా వేసుకొంటూ వెళుతున్న సన్నోబులు తల చుట్టు ఉన్న గోచిగుడ్డ మహారాజుల కిరీటంలాగా కనిపిస్తూ అతడి తప్పెట దరువు విజయదుందుభిలాగా వినిపిస్తూ ఉంటే, ఆనందంతో నాగేశ్వరాచారి పొంగిపోతున్నాడు.